

గండికోటలో ఒబెరాయ్ హోటల్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో బుధవారం ఒబెరాయ్ హోటల్స్ కన్సల్టెంట్ అధికారి గౌతమ్ త్యాగి పర్యటించారు. గండికోటలో 50 ఎకరాల భూమిని 30 ఏళ్ల లీజుకు ఇచ్చిన విషయం తెలిసిందే. మధ్యాహ్నం గౌతమ్ త్యాగి, ఆర్డీవో శ్రీనివాసులుతో కలిసి రోప్‌వే నిర్మాణ పనులను, పెన్నాలోయ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి మల్లికార్జున, సర్పంచు గురుఈశ్వర్, తహశీల్దార్ రమేష్, సర్వేయర్ లక్ష్మీప్రసన్న, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ వివేకానందరెడ్డి పాల్గొన్నారు.



గండికోట పరిసరాలను పరిశీలిస్తున్న ప్రతినిధులు

'ఉక్కు' సంకల్పమేదీ?





రాయలసీమ అనాదిగా వెనుకబడి ఉంది. పాలకులు ఎవరూ సీమ అభివృద్ధి గురించి పట్టించుకున్నపాపాన పోలేదు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి జరగాలంటే వ్యవసాయంతో పాటు పరిశ్రమలు ఎంతో ముఖ్యం. వ్యవసాయం కాస్తా మూలనపడిపోయింది. పరిశ్రమలైనా వస్తాయనుకుంటే అవి కూడా ఆమడదూరంలో ఉంటున్నాయి. సీమ ప్రజల ఆకాంక్ష అయిన ఉక్కు పరిశ్రమతోనైనా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు నిరుద్యోగ సమస్య తీరుతుందని భావించారు. ఎలాంటి ఉద్యమాలు లేకుండానే మనకు బ్రాహ్మణి రూపంలో ఒక ఉక్కు పరిశ్రమ వచ్చింది. ఎంత వేగంగా వచ్చిందో అంతే వేగంగా రద్దయిపోయింది. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు సార్లు శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం వాటి ఊసే లేదు. ఉద్యమాల పుత్రికగా పేరుపొందిన విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ స్థాపనకు చేసినట్లుగా కడప ఉక్కు కోసం పోరాటాలు సాగించాలి. 'కడప ఉక్కు-రాయలసీమ హక్కు' అని ముక్తకంఠంతో నినదించాలి. ఢిల్లీ పాలకుల వెన్నులో వణుకు పుట్టించాలి. వారి మెడలు వంచి తాము కోరుకున్నది సాధించకోవాలి. భవిష్యత్తరాల కోసం ఈ ప్రతిష్టాత్మక పరిశ్రమకు రూపకర్తలుగా మారాలి. ఉక్కు పరిశ్రమ స్థాపనకు రాయలసీమ ప్రజాప్రతినిధులు అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- విభజన హామీకి తూట్లు
- 'సెయిల్' ఏర్పాటుకు కేంద్రం విముఖత
- ప్రభుత్వ రంగంలో చేపట్టడంపై నిర్లక్ష్యం
- ఉపాధి కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విభజనతో గాయపడిన ఆంధ్రప్రదేశ్ దారుణంగా మోసపోయింది. పదేళ్లుగా ప్రత్యేక హోదా దక్కుతుందన్న ఆశతో ఎదురుచూసిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మొండిచెయ్యి చూపించింది. రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు విభజన చట్టంలో హామీ ఇచ్చారు. రాయలసీమలో కరువు ఎక్కువగా ఉంది. భూమి, ఖనిజ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఉక్కు పరిశ్రమ స్థాపనకు అనుకూలమని శ్రీకృష్ణ కమిటీ తమ నివేదికలో పేర్కొంది. 'సెయిల్' బృందం కూడా జిల్లాలో పర్యటించింది. ముడి ఖనిజాల లభ్యత, ఇనుము, డోలమైట్, పరిశ్రమ ఏర్పాటుకు స్థలం, నీరు, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలను పరిశీలించింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం కమిటీల మీద కమిటీలు వేసి చివరికి టాస్క్‌ఫోర్స్ కమిటీ పేరుతో ఎనిమిదేళ్ల కాలయాపన చేస్తోంది. ఎనిమిది బడ్జెట్లలోనూ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీకి కాలదోషం పట్టించింది. విభజన చట్టం-2014లోని షెడ్యూల్-13లో కడప సమీకృత ఉక్కు పరిశ్రమను ప్రత్యేకంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ ఊసేలేదు.

ఖనిజాలకు ఖిల్లా.. పరిశ్రమలేవి?

కడప బేసిన్‌లో అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. కడపకు ఖనిజ నిక్షేపాల ఖిల్లాగా పేరుంది. ఉక్కుతో పాటు ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. ఎన్నో తరాలు తవ్వినా తరగని సున్నపురాయి గనులు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఉన్న బెరైటీస్ మంగంపేటలో నిక్షేపమై ఉంది. బంగారం కంటే 50 రెట్లు విలువ చేసే ఫుల్లరిన్ ఉంది. ఇంకా ఎన్నోరకాల ఖనిజ నిక్షేపాలు జిల్లాలో విస్తారంగా ఉన్నాయి. వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన వనరులు మెండుగా ఉన్నాయి. ఇన్ని వనరులున్నా జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగులు ఉపాధికోసం ఇక్కడి నుంచి వేలాది మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న దుర్భాగ్య పరిస్థితి నెలకొంది.

వేగంగా వచ్చింది...అలాగే రద్దయింది

ఎలాంటి ఉద్యమాలు లేకుండానే మనకు బ్రాహ్మణి రూపంలో ఒక ఉక్కు పరిశ్రమకు అనుమతి వచ్చింది. జిల్లాలో ఉక్కు పరిశ్రమకు అనుమతించడం వరం లాంటిదని అందరూ భావించారు. జిల్లాకు ఉక్కు కర్మాగారం వస్తుందని ఎవరూ ఊహించలేదు. పరిశ్రమకు అవసరమైన భూములు, నీరు, ఇతర రాయితీలు చకచకా జరిగిపోయాయి. బళ్లారికి చెందిన ప్రారిశ్రామిక వేత్త గాలి జనార్ధన్‌రెడ్డి ఇక్కడ పరిశ్రమ స్థాపనకు ముందుకు వచ్చారు. పద్దెనిమిది నెలల్లో 4,500 కోట్లతో రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో బ్రహ్మణి ఉక్కు పరిశ్రమను పూర్తి చేసి పది వేల మందికి ఉపాధి కల్పిస్తామని 2007



జూన్ పదవ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఒఎంసి అక్రమాల కేసులో గాలి జైలుకెళ్లడంతో శాశ్వతంగా ఉక్కు పరిశ్రమకు తెరపడింది. ఎంత త్వరగా వచ్చిందో అంతే వేగంగా రద్దయిన విషయం తెలిసిందే.

ఉక్కు పరిశ్రమ జిల్లాలోనే ఎందుకు?

కడప జిల్లా ఆర్థికంగా, పారిశ్రామికంగా బాగా వెనుకబడిన ప్రాంతం. ఆంధ్రప్రదేశ్ విభజన ఉద్యమాల సందర్భంగా నియమించిన శ్రీ కృష్ణ కమిషన్ ప్రముఖంగా ప్రస్తావించిన ఒక అంశం రాయలసీమ వెనుకబాటు తనం గురించి. తెలంగాణ కంటే రాయలసీమ అన్ని అభివృద్ధి సూచికల్లో వెనుకబడి ఉందంటూ శ్రీ కృష్ణ కమిషన్ తేల్చింది. అంత వెనుకబడిన ప్రాంతంలో నడిబొడ్డున ఉన్నది కడప జిల్లా. వెనుకబాటుతనం పోవాలన్నా, ఉపాధి లభించాలన్నా, తద్వారా అభివృద్ధి జరగాలన్నా కావాల్సింది పరిశ్రమల స్థాపన. ముఖ్యంగా జిల్లాలో 500 మంది పనిచేసే ఒక్క పరిశ్రమ కూడా లేదు. కడప వరం లాంటి ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వమే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మళ్లీ ఇక్కడ ప్రభుత్వ రంగంలోనే పరిశ్రమను స్థాపించాలనే ఉద్దేశం కూడా లేదు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే జిల్లాలో నేరుగా పది వేల మందికి పరోక్షంగా లక్షన్నర మందికి ఉపాధి లభిస్తుంది.

శంకుస్థాపనలపై శంకుస్థాపనలు

జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు పాలకులు శంకుస్థాపనలపై శంకుస్థాపనలు చేసుకుంటూ పోతున్నారు. పరిశ్రమ నిర్మాణ పనులు మాత్రం కనీసం మచ్చుకు కూడా కనిపించడం లేదు. 2007 జూన్ 10న జమ్మలమడుగు మండల పరిధిలోని అంబవరం వద్ద బ్రాహ్మణి స్టీల్‌ప్లాంట్‌కు డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి, 2018 డిసెంబర్ 27న జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ముచ్చటగా మూడో సారి 2019 డిసెంబర్‌లో వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె సమీపంలో కన్యతీర్థం వద్ద శంకుస్థాపన చేశారు. ఆతర్వాత ఆయనే మళ్లీ నాల్గవ సారి ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన ఉక్కు పరిశ్రమకు సున్నపురాళ్లపల్లె వద్ద భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు చేసిందే కాని కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆ ఊసే పట్టించుకోలేదు.

'ఉక్కు' పూర్తి చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వ నిధులతో సెయిల్‌ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించి పార్లమెంటు సాక్షిగా ప్రజాప్రతినిధులు హామీలిచ్చారు. విభజన హామీని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లి జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- ఎం. మహేష్ గోపవరం కాలనీ, బద్వేల్

ఎన్నికల కోసమే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమను ఎన్నికల కోసమే ఉపయోగించుకుంటున్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధి చూపే చిత్తశుద్ధి ఇటు వైసిపికి కానీ, అటు కేంద్రంలోని బిజెపికి లేదు. ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోలేక తిరిగి జిల్లా ప్రజలను వంచిం చేందుకు జిందాల్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఇంతవరకు పనులు ప్రారంభించడం లేదు.

-వీరనాల శివ కుమార్ డివైఎఫ్ఐ వైఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి

శిలాఫలకాలకే పరిమితం

ఉక్కు పరిశ్రమ నిర్మాణం సిఎం సొంత జిల్లాలో కేవలం శిలాఫలకాలకే పరిమితం కావడం దురదృష్టకరం. లక్షలాది మంది నిరుద్యోగుల్లో కనీసం వేలాది మందికైనా ఉపాధి లభిస్తుందని ఆశతో ఎంతోమంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఉక్కు పరిశ్రమపై చిన్నచూపు చేస్తున్నాయి. పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి చూపించాలి

-తోట శివశంకర్, నిరుద్యోగి, నందలూరు

ఉపాధి అవకాశాలకు గండి

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ లో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉండగా పదేళ్లు గడుస్తున్నా అధికారంలో ఉన్న బిజెపి ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో నిరుద్యోగ యువత ఉపాధికి గండి పండింది. దీనివల్ల రాష్ట్రంలో చదువుకున్న యువత ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నైకి వలస వెళ్తున్నారు.

- ఎస్. ఖదీర్, నిరుద్యోగి కలికిరి.

మహిళల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం : జెసి

ప్రజాశక్తి-కడప అర్బన్

మహిళలను ఇబిసి నేస్తం పథకం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. బుధవారం మార్కాపురం పట్టణంలో ఏర్పాటైన బహిరంగ సభ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇబిసి నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో రూ.15 వేలు రెండవ విడత సాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ విసి హాలు నుంచి జాయింట్ కలెక్టర్‌తోపాటు రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు పి.శివ ప్రసాద్‌రెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ గజ్జల వెంకట లక్ష్మీ, రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ జి.రమణమ్మ, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం సాయికాంత్ వర్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 33,087 మంది లబ్ధిదారులకు రూ.49.63 కోట్లు విడుదల చేశామన్నారు. ఇబిసి నేస్తం సాయంతో జీవనోపాధితో పాటు వారి జీవన ప్రమాణాలు కూడా మెరుగు పడనున్నాయన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క నిరుపేద మహిళ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి, మైనారిటీ కార్పొరేషన్ల ఇడి డాక్టర్ వి.బ్రహ్మయ్య, సంబంధిత సంక్షేమ శాఖాధికారులు, లబ్ధిదారులయిన బ్రాహ్మణ, బలిజ, కాపు, ఒంటరి మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న జెసి సాయి కాంత్ వర్మ

సిపిఎం, సిపిఐ ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఐ, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మోడీని గద్దె దింపండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి చేపట్టిన ప్రచార భేరి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కార్యదర్శి రామమోహన్ తెలిపారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రచార భేరికి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిరంకుశ, మతోన్మాద విధానాలపై అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. మోడీ, అమిత్‌షా, నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అదాని, అంబాని లాంటి బడా కార్పేరేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దేవుని, దేశభక్తి పేరుతో భౌతిక వాదులు, ప్రజాస్వామ్యవాదుల పైన దాడులను అరికట్టాలని శాంతియుత పద్ధతిలో ఆందోళన చేస్తున్న వారిపై మోడీ నిరంకుశ విధానాలను వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. మోడీ ఆంధ్రప్రదేశ్‌కు చేస్తున్న ద్రోహం అంతా ఇంతా కాదని ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయడంలోను, విభజన సాక్షిగా పార్లమెంటులో చేసిన హామీలు రాయలసీమకు, ఉత్తరాంధ్రకు, ప్రత్యేక ప్యాకేజీలు, పోలవరం నిధులు, ఉక్కు ప్రయివేటుకరణ కుట్ర చేస్తుంటే ప్రభుత్వం దాసోహంమంటున్నదని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జి.వేణు గోపాల్, కె.సిబాదుల్లా, జిల్లా సమితి సభ్యులు సావంత్ సుధాకర్, మైనుద్దీన్, లింగన్న సిపిఎం నాయకులు చంద్రారెడ్డి, ఫరూక్ పాల్గొన్నారు. **బద్వేలు :** ఈ నెల 17వ తేదీన పట్టణంలో నిర్వహించనున్న ప్రచార యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు శీను, వీరశేఖర్ తెలిపారు. బుధవారం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సభకు పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు చాంద్బాషా, ముడియం చిన్ని, రమణ, నాగరాజు, నాగార్జున, నరసింహ, సగిలి రాయప్ప, సిపిఐ ఏరియా కార్యదర్శి జకరయ్య, నాయకులు రమణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి : ఎపిజెఎసి

కడప అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులలో ఉన్న అసంతృప్తిని, ఆవేదనను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కృష చేయాలని, లేదంటే ఈ ఉద్యమం ఇంతటితో ఆగదని ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం కలెక్టరేట్ ఎపిజెఎసి అమరావతి కడప జిల్లా చైర్మన్ జీవన్, ప్రధాన కార్యదర్శి కె.కె.కుమార్ కోశాధికారి రోనాల్డ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ మంత్రివర్గ ఉపసంఘం, ప్రభుత్వ ఉన్నతాధికార్లతో జరిగిన సమావేశంలో చర్చలు సందర్భంగా ఇచ్చిన హామీలలో సరైన స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ నాయకులు పురుషోత్తం, బాలగంగిరెడ్డి, శేఖర్, రిటైర్డు ఎంప్లాయిస్ అసోషియేషన్ నాయకులు ఐ.ఎం.రావు, ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కె.కె.కుమార్, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, కడప జిల్లా అధ్యక్షులు బోస్ బాబు కార్యదర్శి రామమూర్తి, నాన్ ఆపరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగనాథ్, అంకిరెడ్డి, రావినాయక్, సుబ్బారెడ్డి, సుబ్బయ్య, మురళి పాల్గొన్నారు.

హజ్ హౌస్‌ను వినియోగంలోకి తేవాలి : టిడిపి

కడప అర్బన్: తెలుగుదేశం హయాంలో చంద్రబాబు నాయుడు మైనార్టీలకు పెద్దపీట వేస్తూ జిల్లాలో రూ.28 కోట్లతో నిర్మించిన హజ్ హౌస్‌ను వినియోగంలోకి తీసుకురావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు అన్నారు. బుధవారం హజ్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి సవాల్ విసురుతూ సాక్షాత్తు ముఖ్యమంత్రి సొంత జిల్లాలో డిప్యూటీ సిఎం మైనార్టీ శాఖ మంత్రి ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో మైనార్టీలకు ఉపయోగపడేలా హజ్ హౌస్‌ను ఏర్పాటు చేస్తే చంద్రబాబుకు పేరు వస్తుందన్న ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



హజ్‌హౌస్‌ను చూపిస్తున్న అమీర్ బాబు

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల టౌన్: దళితుల భూములను ఆక్రమిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో సిపిఎం, సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం, ఎంఆర్‌పిఎస్, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని రంగసముద్రం గ్రామ పొలం సర్వే నెంబర్ 1094లో 0.22 సెంట్ల స్థలం ఆదిఆంధ్రపాలెంకు చెందిన బొజ్జ గురయ్యకు వారసత్వంగా వచ్చిన స్థలాన్ని కల్లూరు జయరామిరెడ్డి, ఆయన కుమారుడు రామ్మోహన్‌రెడ్డి దొంగ రిజిస్టర్లు సృష్టించి కబ్జా చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, సిపిఎం మండల కార్యదర్శి ఎన్.భైరవ ప్రసాద్, ఎంఆర్‌పిఎస్ నాయకులు నరసింహులు, సంజీవ్, ఈశ్వరయ్య, చెన్నయ్య, సిపిఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్ ఎర్రబల్లి ప్రసాద్, వీరయ్య, సిపిఎం కాశినాయన మండల కార్యదర్శి పోలయ్య, దళిత ప్రజా సంఘ నాయకులు మనోజ్, రామయ్య, ప్రసన్న పాల్గొన్నారు. సమావేశం అనంతరం అంబేద్కర్ భవనం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు.

చెరువులకు 'గంగ' నీరు : ఎమ్మెల్సీ

కలసపాడు: మండలంలోని చెరువులకు తెలుగుగంగ కాలువ నుంచి లిఫ్ట్ఇరిగేషన్ ద్వారా నీరందిస్తామని ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా అన్నారు. బుధవారం మండలంలోని బాలాయపల్లి గ్రామంలో 11/33 ఉప విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అవసరమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ సబ్ స్టేషన్ కింద నాలుగు ఫీడర్లు పనిచేస్తాయని తెలిపారు. వెలుగోడు ప్రాజెక్టు నుంచి బాలాయపల్లి, వరికుంట్ల చెరువులకు నీటి అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలాయపల్లి సర్పంచ్ తిరుమలరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, గొంటువారిపల్లె, సర్పంచ్ పిచ్చిరెడ్డి, రాఘవరెడ్డి, చిన్నతిరుమల్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీను, విద్యుత్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ జి.వెంకట్రామిరెడ్డి, డి.భరణికృష్ణ, డిఇ హరికుమార్, ప్రొటెక్షన్ డిఇ, ట్రాన్స్‌ఫార్మర్స్ డిఇఇ భాస్కర్‌రెడ్డి, ఎఇ శశిధర్‌రాజు పాల్గొన్నారు.

గిరిజన హక్కులపై అవగాహన

చెన్నూరు: మండలంలోని దౌలతాపురంలోని గిరిజనులకు చట్టాలు, హక్కులపై సీనియర్ సివిల్ జడ్జి కవిత అవగాహన కల్పిం చారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు ఏదైనా సమస్యలుంటే ఫిర్యాదు చేస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం ఒంటరియో సెకండరీ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ కెనడా వారి ఆర్థిక సహాయంతో, జన పరిషత్ సంస్థ ప్రెసిడెంట్ జోసఫ్ చెప్పాలయ్య వారి సహకారంతో విద్యార్థులకు 10 బెంచీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటరీ సురేష్ సహాయం, ఎంఇఒ షర్మిలా రాణి, ఎంపిపి స్కూల్ హెడ్మాస్టర్ జయరాజు, స్కూలు టీచర్ మనోహర్‌రెడ్డి, పోలీసులు, గిరిజనులు పాల్గొన్నారు. ఖాజీపేట మండలంలోని చెన్నముక్కపల్లె పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి కవిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.

ఆర్‌కె నగర్ సమస్యలు పట్టవా? : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : రామకృష్ణ నగర్‌లో అడుగడుగునా సమస్యలతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతుంటే మేయర్‌కి పట్టదా అని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు ప్రశ్నించారు. బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే పర్యటనలుమూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌కె.నగర్ ఏర్పడి 23 ఏళ్లుపూర్తి అవుతున్నా కనీస మౌలిక వసువుల ఏర్పాటులో కార్పొరేషన్ యంత్రాంగం పూర్తిగా వైఫల్యమైందని విమర్శించారు. తాగునీటి, రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్ల సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని పూడ్చుకునేందుకు స్థలం లేదన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, నాయకులు రమణ, యూసఫ్, శ్రీనివాసులు, వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, అంకాలు, కోటేశ్వరి, బాషా పాల్గొన్నారు.

మట్టి నమూనాలను సేకరించండి : జెడి

పోరుమామిళ్ల: ప్రతి రైతూ తమ పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలో డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఆర్‌బికె అసిస్టెంట్లు, మండల వ్యవసాయ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్ష వివరాలను అనుసరించి దానికి అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. వ్యవసాయ శాఖ అమలుపరుస్తున్న పిఎం కిసాన్, రైతు భరోసా, ఎరువుల పంపిణీ తదితర అంశాలను ఆర్బికే వారిగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ వరహరి కుమార్ పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎంలో ఉచిత కంటి వైద్య శిబిరం

కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కీర్తిశేషులు కందుల శివానందరెడ్డి 74వ జయంతిని పురస్కరించుకుని కళాశాల ఎమ్‌డి కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రముఖ కంటి వైద్యురాలు డాక్టర్ టి.శశిబిందు కళాశాల అధ్యాపక సిబ్బందికి, విద్యార్థులకు, పరిసర ప్రాంత స్థానిక నివాసులకు చెందిన 365 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు చేసి పలు సలహాలను, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎ. మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, ప్రోగ్రాం సమన్వయకర్త జె.సురేష్ బాబు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శశిబిందు

జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు విశేష స్పందన

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కడపలోని ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 సీనియర్స్ జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఎంపికలకు 130 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సీనియర్స్ జట్టు ఎంపికలకు 100 మంది హాజరయ్యారు. ఎంపికలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ.రెడ్డి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎం.సాయి పృథ్వీతేజ్ ప్రారంభించారు. ఎంపికల నిర్వహణను వీరు పర్యవేక్షించారు. హాజరైన వారికి బౌలింగ్, బ్యాటింగ్, కీపింగ్ నిర్వహించారు. ఎంపికల్లో మంచి ప్రతిపాదన పరిచిన వారిని ప్రాబబుల్స్ జట్టుకు ఎంపిక చేశారు. అండర్-19 ప్రాబబుల్స్‌గా 65 మందిని, సీనియర్స్ ప్రాబబుల్స్ జట్టుకు 70 మందిని ఎంపిక చేసినట్టు సెలక్షన్ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఎంపికైన వారికి ప్రాబబుల్స్ మ్యాచులు నిర్వహించి తుది జట్లను ప్రకటిస్తామని తెలిపారు. ఎంపికల కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఎస్.అబ్దుల్ రహమాన్ ఫరూక్, మునికుమార్‌రెడ్డి, నాగేంద్రస్వామి, కె.విష్ణుమోహన్‌రావు, వై.శివప్రసాద్ పాల్గొన్నారు.



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

అధికారుల దృష్టికి సమస్యలు తీసుకురావాలి

ప్రజాశక్తి-వల్లూరు

మండలంలో పలు సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని మండల ఉపాధ్యక్షులు గంగయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గంగయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అజెండా అంశాలతో పాటుగా అభివృద్ధి సంబంధించిన ప్రణాళికలను చర్చించుకోవడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సమావేశానికి వచ్చే ముందు మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు అజెండాకు సంబంధించిన అంశాలను ఎంపిడిఒకు అందజేయాలని సూచించారు. ఎప్పుడైతే ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తామో అప్పుడే మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం విద్యా, ఉపాధి, వ్యవసాయ, గృహ తదితర శాఖ అధికారులు తమ యొక్క అజెండా అంశాలను సభకు చదివి వినిపించారు. అభివృద్ధికి సంబంధించిన అంశాలలో వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించి అభివృద్ధిని సాధించేలా ప్రతి ఒక్క అధికారి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ అమరేశ్వరి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రఘు, మండల వైసిపి కన్వీనర్ వీరారెడ్డి, ఇఒపిఆర్‌డి ప్రసాద్, అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

రైతుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేయాలని ప్రభుత్వ ఉద్యాన శాఖ సలహాదారు పుత్తా శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. కెవికె, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలతో సమావేశమై ఆయా కేంద్రాల సాంకేతిక ప్రగతిని సమీక్షించి శాస్త్రవేత్తలకు పలు సలహాలు సూచనలను అందజేశారు. చీనీ, నిమ్మ తోటలల్లో ఎండు తెగులు నివారించడానికి కృషి చేయాలని కోరారు. రైతుల అవసరాలకు పలు పరిశోధనలు సాంకేతిక కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలని శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయంతో మూర్తి అనుబంధం మరువలేనిది

కడప అర్బన్: లండన్‌లోని బ్రౌన్ సమాధి, నివాసాన్ని గుర్తించి వాటి ఛాయాచిత్రాలను తొలిసారిగా బ్రౌన్ స్మారక గ్రంథాలయానికి అందజేసిన గొప్ప పరిశోధకులు డాక్టర్ పసుమర్తి సత్యనారాయణమూర్తి అని సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం ఉదయం పిఎస్ఎన్‌మూర్తి సంస్మరణ సభను నిర్వహించారు. మూర్తి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ఎనలేని సేవలందించారని తెలిపారు. పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ లండన్‌లో బ్రౌన్ చిత్రం కోసం సుమారు రెండు దశాబ్దాలు అన్వేషించిన గొప్ప పరిశోధకుడని పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు జి.హరిభూషణ్‌రావు ప్రసగించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, సిబ్బంది నీలకంఠేశ్వర్, పాఠకులు యు.రాజేష్ కుమార్, ప్రశాంత్, రాజగోపాల్ రెడ్డి, శివాజీ, రాజేష్‌బాబు, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగమూర్తికి 'పూలే సేవా రత్న' అవార్డు

ప్రజాశక్తి-కడప

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తల లింగమూర్తికి 'పూలే సేవా రత్న' అవార్డు రావడం హర్షణీయమని జిల్లా బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు అన్నారు. బుధవారం కడప నగరంలోని పాత రిమ్స్‌లోని జిల్లా బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో లింగమూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ లింగమూర్తి బిసి సంక్షేమ సంఘానికి విశిష్ట సేవలు అందించి, ప్రజాభిమానులు పొందడం ఎంతో ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో బిసి నాయకుల సోదరులు పాల్గొన్నారు.



లింగమూర్తి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

టిడిపి, బిజెపి నుంచి 30 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు

టిడిపి, బిజెపి నుండి మైలవరం మండలం పొన్నంపల్లె గ్రామానికి చెందిన 30 కుటుంబాలు బుధవారం వైసిపిలో చేరాయి. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మైలవరం మండలం ఇన్‌ఛార్జి దొడియం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొన్నంపల్లె గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి వచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు మద్దతు తెలుపుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి మద్దతు తెలిపారని పేర్కొన్నారు.



వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

విభిన్నప్రతిభావంతులకు రంజాన్ తోఫా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రంజాన సందర్భంగా 20మంది విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు రంజాన్ తోఫా, వాటర్ క్యాన్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కొత్తపల్లి సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నిత్యవసర సరుకులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి కార్యక్రమం ప్రతి ఒక్కరూ చేపట్టాలని ఆయన కోరారు. షాకీర్ హుస్సేన్‌ను అభినందించారు. కార్యక్రమంలో బద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ కిషోర్, మహమ్మద్‌బాషా, వెంకటసుబ్బయ్య, హనుమంతు, అల్తాఫ్, భద్రుడు, మాబు పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న సర్పంచు శివచంద్రారెడ్డి

పార్టీలో గుర్తింపు లేకనే వైసిపికి రాజీనామా

- మాజీ దేవస్థానం చైర్మన్ జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పార్టీ కోసం పని చేసినా గుర్తింపు ఇవ్వకపోవడంతో వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు శ్రీవృషభాచలేశ్వర దేవస్థానం (ఎద్దులకొండ) మాజీ చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం ఆయన వేంపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో జరిగే ఏ ఒక్క కార్యక్రమాన్ని కూడా తనకు తెలపడంలేదన్నారు. తాను పార్టీలో ఉన్నానో.. లేనో కూడా తెలియడంలేదన్నారు. అందుకే మనస్థాపంతో వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ విజయం కోసం కష్టపడి పని చేసినా విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విలువ లేని చోట ఉండడం కంటే బయటికి రావడం మంచిదని భావించానని తెలిపారు. సిఎం దృష్టికి తీసుకెళ్లినా స్థానిక నాయకుడు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సిఎంను కలవడానికి అపాయింట్మెంట్ ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుతానికి తన కుటుంబం ఒక్కటే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

నీటిని వృథా చేయరాదు : ఎమ్మెల్యే

కొండాపురం :నీటిని వృథా చేయరాదని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బుధవారం ఆయన నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి శుద్ధ నీటి జలాలు అందిస్తున్న ఘనత వైయస్ జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. గతంలో గ్రామాల్లో శుద్ధ నీటి జలం లేక ఫ్లోరైడ్ ప్రజలు ఫ్లోరైట్ బారిన పడేవారని తెలిపారు. కార్యక్రమంలో గజ్జల రామసుబ్బారెడ్డి, చింత రాజారెడ్డి, పెద్దిరెడ్డి, గజ్జల విష్ణువర్ధన్‌రెడ్డి, సుమంచిపల్లె విశ్వనాథరెడ్డి, బాల నాగిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సుగుమంచిపల్లి నాగేశ్వరరెడ్డి, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు అనేక ఇబ్బందులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : వైసిపి పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు నిత్యవసర ధరలను అమాంతంగా పెంచడంతో ప్రజలు ఇదేం కర్మ అంటూ ప్రశ్నిస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మోడంపల్లె వీధిలో బుధవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కాకి తిరుపతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, కసిరెడ్డి, ప్రశాంత్ చంద్ర, సుబ్రహ్మణ్యం, పండు, విష్ణు, మురళి సుబ్బారెడ్డి, ఫక్రుద్దీన్, ఆవుల దస్తగిరి, మస్తాన్ గోలే, సురసుర శ్రీనివాసులు, గోపవరం గౌస్, పట్నం మాబాషా, షాకీర్, నాయకులు పాల్గొన్నారు.

నాయకులు, అధికారులు కలిసి పనిచేయాలి

ఎర్రగుంట్ల :పట్టణంలోని ప్రతి కౌన్సిల్ వార్డుల్లో గుర్తించలేని ఓటర్లను అన్ని పార్టీల నాయకులకు చర్చించి గుర్తించేలా అన్ని పార్టీల నాయకులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని తహశీల్దార్ నాగేశ్వరరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయన అన్ని పార్టీల నాయకులు, సచివాలయ విఆర్‌ఒలు, బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో దాదాపు 3,700 ఓటర్లు గుర్తింపబడలేదని పేర్కొన్నారు. వీరికి సంబంధించిన జాబితాను ప్రతి రాజకీయ పార్టీ నాయకులకు అందించి గుర్తించేలా చూడాలని బిఎల్‌ఒకు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఓటు నమోదు చేసుకునేలా నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ వీరభద్ర, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

231 మంది వాలంటీర్లు ఎంపిక

చాపాడు :మండల పరిధిలోని 231మంది వాలంటీర్లు సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు తెలిపారు. మండలంలో ఒకరికి వజ్ర పురస్కారం ద్వారా రూ.30వేలు, 5మందికి రత్నా పురస్కారం ద్వారా రూ.20వేలు, 231 మందికి సేవా మిత్ర పురస్కారం ద్వారా రూ.10వేలు మంజూ రవుతుందన్నారు. నగదు వాలంటీర్ల ఖాతాలో త్వరలో జమ అవుతుందని తెలిపారు. అలాగే వాలంటీర్లను శాలువా, మెడల్, సర్టిఫికెట్‌తో సన్మానిస్తామన్నారు

క్రైం కార్నర్

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వేంపల్లె వాసి

ప్రజాశక్తి - వేంపల్లె

సైబర్ నేరగాళ్ళ చేతిలో వేంపల్లెకు చెందిన పీరయ్య అనే వ్యక్తి మోసపోయి రూ.72,990 వేలు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. వేంపల్లి పట్టణంలోని గరుగు వీధికి చెందిన గుడిపాడు పీరయ్యకు బుధవారం సైబర్ నేరగాళ్లు ఫోన్‌లో మాయ మాటలు చెప్పి గూగుల్ పే ద్వారా రూ.72, 990 నగదును దోచుకున్నారు. మీ బామ్మర్ది చెప్పాడు.. ఆరోగ్యశ్రీ డబ్బులు మీ అకౌంట్లో వేస్తామని చెప్పి నమ్మించి మోసం చేశారని బాధితుడు పీరయ్య వాపోయాడు. డబ్బు పోయిన విషయాన్ని తొందరగా గ్రహించి బ్యాంకులో సంప్రదించినట్లు చెప్పారు. అప్పటికే డబ్బులు డ్రా అయిపోయినట్లు తెలిసిందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ అందరూ మోసపోతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని హిజ్రాకు గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

మండల పరిధిలోని ఎఒ బాయపల్లి గ్రామం వద్ద బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో హిజ్రాకు తీవ్ర గాయాలయ్యాయి. కమలాపురానికి చెందిన హిజ్రాకు ఈ ప్రమాదంలో రెండు పాదాలు పూర్తిగా నలిగిపోయాయి. స్థానికులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఆగిన ఇంటింటికీ రేషన్ బియ్యం..!

- చిన్నకొండప్ప కాలనీ సచివాలయ పరిధిలో రెండు నెలలుగా అందని వైనం.. చౌకదుకాణాల చుట్టూ లబ్ధిదారులు



రేషన్ షాపు వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే బండి రెండు నెలలుగా రావడంలేదు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు డీలర్ షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రధానంగా రెండు నెలల నుంచి చిన్న కొండప్ప కాలనీ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు ఇంటింటికి బియ్యం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారు. కార్డుదారులు రేషన్ కోసం పట్టణంలోని డీలర్ల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు రేషన్ డీలర్లు మా సచివాల పరిధి కాదని రేషన్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. రేషన్ తీసుకోకపోతే కార్డు తొలగిస్తారనే భయం లబ్ధిదారుల్లో ఉంది. లబ్ధిదారుల సమస్య అధికారులకు తెలిసినా పరిష్కరించడానికి ప్రయత్నించపోవడం వల్ల లబ్ధిదారులు తిప్పలు పడుతున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పరిష్కరించలేక నిర్లక్ష్యం చేస్తుండడం వల్ల పలు అనుమానాలకు దారి తీస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అవినాష్ రెడ్డి ప్రతినిధ్యం వహిస్తున్న భాకరాపురం సచివాలయంలో కూడా ఇంటింటికి సరఫరా సరిగా జరగలేదని విషయం మాధ్యమాల్లో ప్రచారం జోరుగా సాగింది. ఓ వైపు స్థానిక ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రజా సమస్య పరిష్కారం చేస్తుంటే.. కిందిస్థాయి అధికారులు, కార్యకర్తలు, కొంతమంది స్మార్ట్ నాయకులు ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ ఇంటింటికి అందేలా చూడాలని లబ్ధిదారులు, ప్రజలు కోరుతున్నారు.

రెండు రోజుల్లో రేషన్ బియ్యం అందిస్తాం

చిన్న కొండప్ప కాలనీ సచివాలయం పరిధిలో రేషన్ దుకాణంలో రికార్డులు సరిగా లేనందున దాన్ని సీజ్ చేశామని, ఈ నేపథ్యంలో రేషన్ ఇంటింటి సరఫరాలో జాప్యం జరుగుతోంది. రెండు రోజుల్లో ప్రతి ఒక్కరికి రేషన్ బియ్యం అందిస్తాం. రేషన్ సరఫరాలో అవకతవకలు జరిగితే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటాం.

- గోపీనాథ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్

ప్రజా సంక్షేమమే జగన్ ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నట్లు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వీరన్నగట్టుపల్లె గ్రామంలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటకెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఎంపీ వివరించారు. ప్రతి ఇంటి రెండు, మూడు పథకాలు మంజూరయ్యాయని తెలిపారు. ఇళ్లు లేని వారందరికీ ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత సిఎం జగనన్నదే అన్నారు. జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం విరాజిల్లుతున్నట్లు తెలిపారు. ఎంపి గడపగడపకు వెళ్లడంతో ప్రజలందరూ నీరాజనం పలికారు. కార్యక్రమంలో సర్పంచు చలపతి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, వేంపల్లె సర్పంచు రాచినేని శ్రీనివాసులు, నాయకుడు కృష్ణాతేజ, దర్బార్, చాను, గోపి, శ్రవణ్‌కుమార్, ఎంపిటిసి పద్మా రాజ్‌కుమార్, మటన్ బాబా పాల్గొన్నారు.



గాయపడిన వ్యక్తితో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

పుష్పగిరి బ్రహ్మోత్సవాల గోడ పత్రికల ఆవిష్కరణ

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన క్షేత్రాల్లో ఒకటిగా పిలవబడే పుష్పగిరి క్షేత్ర బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ఆవిష్కరించారు. వీరన్నగట్టుపల్లె గ్రామంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కమలాపురం వైస్ ఎంపిపి చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుమంత్ స్వామి మాట్లాడుతూ పుష్పగిరి ఆలయంలో ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఈనెల 23న భారతీ సిమెంట్ సౌజన్యంతో అఖిల భారత ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన, ఓల్డ్ క్యాటగిరి ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బండలాగుడు పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పుష్పగిరి ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి, ఖాజీపేట వైసిపి మండల కన్వీనర్ మురళిమోహన్‌రెడ్డి, అదినిమ్మాయాపల్లె వైసిపి నాయకుడు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తనిధి కేంద్రం ఏర్పాటు సంతోషకరం



రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రాన్ని ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా ప్రారంభించారు. పట్టణం చాలా వేగంగా అభివద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు అనేక ప్రయివేట్ ఆస్పత్రులున్నాయి. నాలుగు మండలాల ప్రజలు ఇక్కడి ఆస్పత్రికి వస్తుంటారు. పోరుమామిళ్ల పట్టణంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, డాక్టర్ల కృషితో రక్త నిధి ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకమని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సి.బాషా, రాజశేఖర్, ఎంపిటిసి ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచు రవిప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డాక్టర్ నాగేంద్ర, సాధు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి - చాపాడు

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు సూచించారు. అల్లాడుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విలేజి హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రక్తహీనత ఎక్కువ ఉన్నవారికి వైద్యులు అవసరమైతే ఐరన్ ఇంజక్షన్ ఉపయోగిస్తారని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రసవం సురక్షితమని తెలిపారు. గర్భిణులు తప్పకుండా ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవం కావాలని ఆయన కోరారు. కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఉమామహేశ్వర్ రావు, మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, డాక్టర్ కావ్య, ఎంపిహెచ్ఒ, క్లస్టర్ పర్యవేక్షకులు రమేష్, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, గర్భిణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



కార్యక్రమంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజా సంక్షేమ ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పాలన సాగుతోందని మండల సచివాలయ కన్వీనర్ సుమంత్ యాదవ్ అన్నారు. మండలంలోని మంగపట్నం గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు సుమంత్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు బాల్‌రెడ్డి, నాయకులు బాలిరెడ్డి, బయపురెడ్డి, పుల్లారెడ్డి, పుల్లం నాయుడు, నారాయణస్వామి, బాబు, వెంకటేష్, ఉపేంద్ర, జోసెఫ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గంగాధర పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** మండలంలోని అక్కలరెడ్డిపల్లె గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా జగనన్న ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మంచి పనులు, ప్రభుత్వ పథకాల ఉపయోగాలను ఎంపిటిసి రాయపాటి రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు మేరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వాలంటీర్లు, కన్వీనర్ బాలకృష్ణ, కార్యకర్తలు, అభిమానులు పాల్గన్నారు. **చింతకొమ్మదిన్నె :** ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట పెన్నిధిగా పేద ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారని వైసిపి నాయకులు 16వ డివిజన్ ఇన్‌ఛార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో నగర పరిధిలోని మామిళ్ళపల్లె 16 వార్డులో జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కరింగులను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిళ్ళపల్లె ఎస్‌సి, ఎస్‌టి, బిసి, దళిత రిజర్వేషన్ జాగృతి అంబేద్కర్ సంస్థ వ్యవస్థాపకులు, బూత్ కన్వీనర్ కానగల సుబ్బరామయ్య, వాలంటీర్లు, గృహ సారధులు హర్షవర్ధన్, కానగల సుబ్బారాయుడు, ఎస్ సిద్దు, ఎ.రాజేశ్వరి, బాలు, పట్నం గౌరి, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై ఆర్‌డిఒ విచారణ

ముద్దనూరు :ఉప్పులూరు గ్రామంలో గతేడాది డిసెంబర్ 7న రైతు కాతా రామిరెడ్డి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు డివిజన్ స్థాయిలో కుటుంబ సభ్యులను విచారించారు. రైతు ఆత్మహత్యకు గల కారణాలను ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తమ సొంత పొలంతోపాటు భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశాడు. పంట దిగుబడి రాక అప్పులు ఎక్కువయ్యాయి. ఆ బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు రైతు భార్య లక్ష్మిసుబ్బమ్మ, కుమారుడు శివమోహన్ రెడ్డి అధికారులకు తెలిపారు. ప్రభుత్వం నుండి ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఆర్‌డిఒ తెలిపారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సిఐ నరేష్ బాబు, వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి, ఆర్‌ఐ ఏసోబు పాల్గొన్నారు.

బస్సుషెల్టర్ ఏర్పాటు చేయాలని సిపిఎం ఆందోళన

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని బుధవారం అయిదు రోడ్ల కూడలిలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గోవింద్, మండల కమిటీ సభ్యులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో రోడ్ల వెడల్పు కార్యక్రమం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు చేపట్టారని తెలిపారు. అందులో భాగంగా బస్ షెల్టర్ తొలగించారని తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా మళ్లీ బస్ షెల్టర్ నిర్మించలేన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎర్రంపల్లి అజయ్, కార్యకర్తలు కలివేల రాజశేఖర్, భాస్కర్, బిగ్ బాస్, జయరాములు, చక్రవర్తి, చిన్నబ్బి, మాలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

చాపాడు ఎస్‌ఐగా మైనుద్దీన్

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ఎస్ ఐగా మైనుద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కెసి రాజు కడప స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు వన్‌టౌన్‌లో ఎస్‌ఐగా ఉన్న మైనుద్దీన్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ మైనుద్దీన్

ఆచరణలో ఆమడదూరం

- 'మా నమ్మకం నువ్వే జగన్'లో కనిపించని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

ప్రజాశక్తి - కొండాపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పరిపాలనపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం అమలుకు ముందుగానే పార్టీలోని కొందరు కార్యకర్తలను గుర్తించి సచివాలయానికి ఇద్దరు కన్వీనర్లు, మరి కొందరిని గృహసారథులుగా నియమించారు. వీరి ద్వారా తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులను తెలియజేయడంతోపాటు ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయం తెలుసుకొనుటకై 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఆ ఆలోచన ఆచరణకు ఆమడ దూరం అన్నట్లు ఉంది. కొండాపురం మండలంలో పరిస్థితి. మండలంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులుగా ఉన్నవారు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లడంలేదని తెలుస్తోంది. తమ గ్రామ సమస్యలపై ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోననే భయం వారిలో ఉన్నట్లుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ కారణంగా వాలంటీర్ల ద్వారానే స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారని ప్రజలు చర్చించుకుంటున్నారు. వాలంటీర్లుగా ఉన్న వ్యక్తుల కుటుంబంలోని వారినే గృహసారథులుగా నియమించారు. అందుకనే ఆ కుటుంబంలోని వాలంటీర్లే స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా దీనిపై పార్టీ అధినాయకులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. పార్టీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ప్రజల ఇళ్ల వద్దకెళ్లాల్సి ఉంది. అప్పుడే జగన్ ఆశయం నెరవేరినట్లు అవుతుందని ప్రజలు సూచిస్తున్నారు.

గోరంత ఇస్తూ.. కొండంత లాగుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం ప్రజలకు గోరంత ఇస్తూ.. పన్నులు, ధరల పెంపుతో కొండంత లాగుతోందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. మట్టి ముంత ఇచ్చి వెండి చెంబు దొంగలిచ్చినట్లుంది సిఎం జగన్ వాలకమని ఆయన బుధవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో విమర్శించారు. దీనికి తోడు దాన కర్ణుడులా బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. సొంత మీడియాకు ప్రభుత్వ నిధులు మళ్లింపు జరుగుతున్నట్లు ఆరోపించారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, ఇబిసి నేస్తం పథకాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం ఇస్తున్నది జానెడు అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ఉత్తన్న, రవి, శివ, చెన్నకేశవ, నరసింహరెడ్డి, సత్తార్, బద్రీ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రధాన ట్రాక్‌లోకి దూసుకొచ్చిన రైలు ఇంజిన్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని కోరమండల్ సిమెంట్స్(ఐసిఎల్) కర్మాగారానికి చెందిన గూడ్స్ రైలు లోకో పైలట్ నిర్లక్ష్యం కారణంగా లూప్ లైన్ నుండి కడప-తాడిపత్రి ప్రధాన ట్రాక్‌లోకి వచ్చింది. రైలు ఇంజన్ స్టార్ట్ చేసి హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతో రైలు నెమ్మదిగా కదిలి మెయిన్ ట్రాక్ లోకి వచ్చింది. అక్కడ ఉన్న లూప్ లైన్ ట్రాక్ మార్చకపోవడంతో నేరుగా ఇసుకలోనికి వెళ్లి ఆగింది. ఆ సమయంలో మెయిన్ ట్రాక్ వెంబడి ఎలాంటి రైలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన రైల్వే ఉన్నతాధికారులు హుటాహుటిన ప్రమాదస్థలానికి చేరుకొని పరిశీలించారు. లోకో పైలట్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.



ఇసుకలో కూరుకుపోయిన రైలు ఇంజిన్

పిడుగుపల్లెలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



మృతి చెందిన దినేష్

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలోని పిడుగుపల్లి గ్రామంలో బుధవారం ఈతకు వెళ్లి కొమ్మాలపాటి దినేష్ అనే బాలుడు మృతి చెందాడు. గ్రామ సమీపంలోని చెరువులో కొంతమంది విద్యార్థులతో కలిసి సరదాగా ఈత కొడుతుండగా వసంత శేఖర్, నారాయణమ్మగారి కుమారుడు మునిగి ఉండగా విద్యార్థులు గమనించారు. బయటికి తీసేసరికి దినేష్ మృతి చెందినట్లు తెలిసింది. మతుడు దినేష్ వంకమర్రి సమీపంలోని సగిలేరు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్లు తెలిసింది. స్నేహితులతో సరదాగా వెళ్లిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు విలపించారు.